క్లుప్తంగా

పారా లీగల్ వలంటీర్లకు చట్టాలపై అవగాహన అవసరం



పొన్నూరు: పారా లీగల్ వలంటీర్లు చట్టాలపై పరిజ్ఞానం కలిగి ఉంటే న్యాయ సేవలు అందంచగలరని తెనాలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ ఏకా పవన్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం స్థానిక కోర్టు హాలులో తెనాలి 11వ అదనపు జిల్లా, సెషన్స్ కోర్టులో న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నూతనంగా నియమితులైన పారా లీగల్ వలంటీర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయమూర్తి పాల్గొని మాట్లాడారు. కక్షిదారుల మధ్య ఉన్న వివాదాల పరిష్కారానికి న్యాయసేవాధికార సంస్థ పరిష్కారానికి వలంటీర్లు బాధ్యతలు నిర్వహించాలని సూచించారు.

థింక్ లైక్ ఏ క్లౌడ్ యాక్ట్ లైక్ ఏఐపై సెమినార్



గుంటూరు రూరల్: సమస్యల పరిష్కారానికి పూర్తిగా సాంకేతికతపై ఆధారపడకుండా, స్వీయ ఆలోచనలకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎర్నెస్ట్ యంగ్ ఎల్ఎల్‌పి టెక్నాలజీ కన్సల్టెంట్ సీనియర్ మేనేజర్ పవన్‌సతీష్‌కుమార్ అన్నవరపు తెలిపారు. శనివారం చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో థింక్ లైక్ ఏ క్లౌడ్ యాక్ట్ లైక్ ఏఐపై అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పరిశ్రమల్లో ఎదురయ్యే క్లిష్ట సమస్యలకు కృత్రిమ మేధా ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్ ద్వారా పరిష్కార మార్గాలను వివరించారు. ఏఐతో అన్ని రంగాలల్లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్నాయని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేని తెలిపారు. అతిథులను కళాశాల కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, స్వర్ణశ్రీ పాల్గొన్నారు.

కుక్కల బెడదతో గ్రామస్తుల బెంబేలు



గుంటూరు రూరల్: వట్టిచెరుకూరు మండలం వట్టిచెరుకూరులో కుక్కల బెడదతో గ్రామస్తులు బెంబేలెత్తుతున్నారు. శనివారం గ్రామంలోని రైతు మక్కెన సుబ్బారావుకు చెందిన దూడపై కుక్కలు దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన స్థానికులను కలచివేసింది. దూడను తీవ్రంగా గాయపరచటంతో వెంటనే స్పందించిన స్థానికులు రైతులు దూడకు చికిత్సను అందించారు. దూడ ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉంది. అధికారులకు ఎన్నిసార్లు మొత్తుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదని, ప్రతి వీధిలో పదుల సంఖ్యలో కుక్కలు తిరుగుతూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తెగిపడ్డ హైటెన్షన్ తీగలు

పట్నంబజారు: నగరంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట శనివారం మధ్యాహ్నం సమయంలో హైటెన్షన్ విద్యుత్ తీగలు ప్రమాదవశాత్తు తెగిపడ్డాయి. స్థానికులు భయాందోళనకు గురయ్యారు. హైటెన్షన్ విద్యుత్ తీగ తెగి పక్కనే ఉన్న చెట్టుపై పడింది. దీంతో ఆ చెట్టుపై స్వల్పంగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలు అదుపులోకి తెచ్చారు.

నేడు, రేపు పని చేయనున్న క్యాష్ కౌంటర్లు

నెహ్రూ నగర్: ఉగాది, రంజాన్ పండుగల సెలవు రోజుల్లో కూడా యథావిధిగా నగరపాలక సంస్థ ట్యాక్స్ కలెక్షన్ కౌంటర్లు పనిచేస్తాయని కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారంలో ఓ ప్రకటనలో తెలిపారు. ఆస్తి పన్ను చెల్లించటానికి రెండు రోజులే గడువు ఉన్న నేపథ్యంలో ఆది, సోమవారాల్లో కూడా పన్ను చెల్లింపుదారులకు సౌలభ్యంగా జీఎంసీ ట్యాక్స్ కలెక్షన్ కౌంటర్లు ఉదయం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు పని చేస్తాయన్నారు.

ఏదీ స్వచ్ఛత.. లేదు శుభ్రత..



25 వార్డులోని ప్రధాన డ్రైయిన్‌లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వస్తువులు



నీటి పారుదలకు అడ్డుగా మారిన ప్లాస్టిక్ వ్యర్థాలు

పొన్నూరు: పట్టణంలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. వార్డుల వారీగా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నా పూర్తిస్థాయిలో ప్రయోజనం లేకుండా పోతోంది. ప్లాస్టిక్ నియంత్రణను పట్టించుకోకపోవడంతో ప్లాస్టిక్ కవర్ల వినియోగం, విక్రయం కూడా పెరిగిపోతుంది. ప్రధాన సెంటర్లలో ప్లాస్టిక్ నిషేధం అమల్లో ఉన్నా పలుచోట్ల దుకాణాలు, హోటళ్లలో వినియోగం, విక్రయం సాఫీగానే సాగుతోంది. వాడి పారేసిన పాలిథిన్ కవర్లు, గ్లాసులు, కప్పులు తదితర వస్తువులతో డ్రెయిన్లు నిండిపోతున్నాయి. రోడ్డు పక్కన కూడా ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. ప్రజారోగ్య విభాగం పూర్తిస్థాయిలో ప్లాస్టిక్ నిషేధంపై దృష్టిసారించి ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించి డ్రెయిన్లలో ప్లాస్టిక్ వ్యర్థాలు నిల్వ చేరకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

పట్నంబజారు: మద్యం మత్తులో ఐదుగురు వ్యక్తులు తండ్రి, కొడుకుపై దాడి చేసిన ఘటనపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాలు... జిన్నాటవర్ సెంటర్‌లో బ్యాగుల షాపు నిర్వహించే షేక్ అష్రఫ్ ఈనెల 28వ తేదీ రాత్రి ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న మోడరన్ బార్‌కు వెళ్లాడు. ఈక్రమంలో పార్కింగ్ విషయంలో అక్కడ ఉన్న కొంత మంది వ్యక్తులతో వివాదం జరిగింది. ఆసమయంలో అష్రఫ్ కుమారుడు హర్షద్ తండ్రి వద్ద షాపు తాళాలు తీసుకొచ్చేందుకు వెళ్లాడు. తండ్రిపై దాడిచేస్తున్న వ్యక్తులను అడ్డుకోబోయిన హర్షద్‌తోపాటు, తండ్రిపై దాడి చేసి గాయపరిచారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నల్లపాడు చెరువు అభివృద్ధికి చర్యలు

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



నల్లపాడు చెరువు మ్యాప్‌ను పరిశీలిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, ఎమ్మెల్యే రామాంజనేయులు, కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని 93 ఎకరాల నల్లపాడు చెరువుని పూడిక తీయించి, సమగ్రాభివృద్ధికి చర్యలు తీసుకుంటామని కేంద్ర కమ్యూనికేషన్స్, గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ప్రత్తిపాడు శాసనసభ్యులు డాక్టర్ బూర్ల రామాంజనేయులు, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, ఇరిగేషన్, రెవెన్యూ, జీఎంసీ అధికారులతో కలసి నల్లపాడు చెరువు మ్యాప్‌ని పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ 27వ డివిజన్‌లోని నల్లపాడు చెరువులో 93 ఎకరాలను 30- 40 ఏళ్లుగా పూడికలు తీయకపోవడం వలన చెరువు పూడుకు పోయిందని చెప్పారు. డివిజన్ కార్పొరేటర్, ప్రజలు తమకు చెరువు అభివృద్ధి చేయాలని పలుమార్లు తమ దృష్టికి తెచ్చారన్నారు. డ్రెయినేజి సమస్యలు, భూములు ఆక్రమించిన వెంచర్ల సమస్యలు కూడా ఉన్నాయని పేర్కొన్నారు. పూడికలను ప్రభుత్వం తరఫున కాంట్రాక్ట్ ఇచ్చి, తీయించడం ద్వారా రూ.10- 12 కోట్లు నిధులు సమకూరే అవకాశం ఉందని, ఆ నిధుల ద్వారా వాకింగ్ ట్రాక్, ప్లే గ్రౌండ్, చెరువులో నీటి నిల్వ పెంచడం చేస్తామన్నారు. ప్రత్తిపాడు శాసన సభ్యుడు రామాంజనేయులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం గుంటూరు నగరపాలక సంస్థలోని విలీన గ్రామాల్లో అభివృద్ధి పనులు విస్తృతంగా చేపట్టామన్నారు. ఇప్పటి వరకు రోడ్లు, డ్రెయిన్లు, తాగునీటి సరఫరా వంటి మౌలిక వసతులపై దృష్టి సారించామని వివరించారు. ఇక నుంచి ఆయా ప్రాంతాల్లోని చెరువుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. చెరువుల అభివృద్ధిలో భాగంగా వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్, పిల్లల ఆట వస్తువులు ఏర్పాటు చేసి ఆహ్లాదకరమైన వాతావరణం వచ్చేలా కృషి చేస్తామన్నారు. నల్లపాడు చెరువులో సుమారు 4.5 ఎకరాలు దళితులు సాగు చేసుకుంటున్నారని, ముందుగా సర్వే చేపట్టిన తర్వాత వారి జీవనోపాధికి భంగం కలగకుండా తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కమిషనర్ మాట్లాడుతూ నల్లపాడు చెరువుని సమగ్రంగా సర్వే చేయిస్తామన్నారు. చెరువు అభివృద్ధి ద్వారా నల్లపాడు పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరగుతాయని పేర్కొన్నారు. చెరువు పరిసరాల్లో ఏర్పాటు చేసిన వెంచర్ల అనుమతులను పరిశీలించి నివేదిక ఇవ్వాలని పట్టణ ప్రణాళికాధికారులను ఆదేశించామని చెప్పారు. పర్యటనలో కార్పొరేటర్లు చల్లా రాజ్యలక్ష్మి, బి.స్మితపద్మజ, జీఎంసీ సిటీ ప్లానర్ రాంబాబు పాల్గొన్నారు.

పొన్నూరులో ఉగాది శోభ

- ప్రత్యేక పూజలు, పంచాంగ శ్రవణాలకు ఏర్పాట్లు
- కొనుగోలుదారులతో కిక్కిరిసిన మార్కెట్



అలంకరణలో స్వామివారు

పొన్నూరు: ఉగాది పండుగ నిర్వహణకు జోరుగా ఏర్పాట్లు సాగుతున్నాయి. ఆలయాలన్నీ ఇప్పటికే పండుగ ఏర్పాట్లతో కళకళలాడుతున్నాయి. దాదాపు అన్ని ఆలయాల్లో ఉదయం నుంచి వేద పండితులతో నిర్వాహకులు పంచాంగ పఠనం చేయించనున్నారు. అందుకు తగినట్లుగా ఆలయ ప్రాంగణాల్లో వేదికలు సిద్ధం చేశారు. ఆలయ అధికారులు, కమిటీల ఆధ్వర్యంలో దేవాలయాల్లో భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజాము నుంచే స్వామి వార్లను దర్శించుకొని పూజలు నిర్వహించేందుకు వచ్చే భక్తుల కోసం ఏర్పాట్లు చేశారు. ఆలయాలు, గృహాలు, కార్యాలయాలు, వ్యాపార సంస్థలను మామిడి తోరణాలతో అలంకరించారు. ఇక పండుగ సందర్భాన్ని పురస్కరించుకుని శనివారం పట్టణంలోని మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. ముఖ్యంగా ఐలాండ్ సెంటర్‌లోని పూల మార్కెట్‌లో కొనుగోలుదారులతో సందడి నెలకొంది.



విద్యుత్ దీపాలంకరణలో శ్రీ కోదండ రామాలయం

పారిశుద్ధ్య పనుల్లో మెరుగుదల కనిపించాలి

కార్పొరేషన్ కమిషనర్ శ్రీనివాసులు



రెడ్డిపాలెంలో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు రూరల్: నగరపాలక సంస్థ పరిధిలో పారిశుద్ధ్య పనుల్లో మెరుగుదల ఉండాలని, విధుల్లో నిర్లక్ష్యంగా ఉండే కార్యదర్శులు, అధికారులపై చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. శనివారం కమిషనర్ రెడ్డిపాలెం, గోరంట్ల, ఇన్నర్‌రింగ్‌రోడ్, భారత్‌పేట తదితర ప్రాంతాల్లో పర్యటించి, అభివృద్ధి, పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో మెరుగైన పారిశుద్ధ్య పనుల కోసం కార్మికుల రేషనలైజేషన్, ప్రత్యేకంగా అదనపు కార్మికులు, వాహనాలు, పుష్ కాట్స్ అందుబాటులో ఉంచామన్నారు. అయినప్పటికీ క్షేత్ర స్థాయిలో సిబ్బంది, కార్యదర్శుల నిర్లక్ష్యం వలన పలు ప్రాంతాల్లో డంపింగ్ పాయింట్స్ ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రెడ్డిపాలెం శ్మశానం వద్ద చెత్త డంపింగ్ చేయడం గమనించి, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పుష్ కాట్‌ల ద్వారా సేకరించిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు డంపింగ్ యార్డు తరలించాలన్నారు. ప్రాంతాల్లో నూతనంగా నిర్మాణం చేసిన సీసీ రోడ్లను పరిశీలించి, డ్రైన్ నిర్మాణం చేసిన అనంతరమే రోడ్ నిర్మాణం చేయాలన్నారు. శంకర్ విలాస్ ఆర్‌ఓబీని పరిశీలించి, బ్రిడ్జిపై డస్ట్ పేరుకోకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని చెప్పారు. పర్యటనలో డీఈఈ రమేష్‌బాబు, ఎస్ఎస్ సోమశేఖర్ పాల్గొన్నారు.

ఏబీఏపీ 2025 గ్లోబల్ కాన్ఫరెన్స్ పోస్టర్ ఆవిష్కరణ



గుంటూరు రూరల్: అసోసియేషన్ ఆఫ్ బయోటెక్నాలజీ అండ్ ఫార్మసీ (ఏబీఏపీ) 19వ అన్యువల్ కన్వెన్షన్‌లో భాగంగా చలపతి ఫార్మసీ కళాశాలతో కలిసి డిసెంబర్ 18వ తేదీ నుంచి 20వ తేదీ వరకు మూడు రోజుల గ్లోబల్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. శనివారం నగర శివారుల్లోని లాంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బ్రోచర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఇంటిగ్రేటింగ్ టెక్నాలజీ విత్ హెల్త్ కేర్ ఫార్మాసిటికల్స్, బయో టెక్నాలజీ, అగ్రికల్చర్ అండ్ బయో మెడికల్ సైన్స్ ఫర్ సస్టైనబుల్ డెవలప్మెంట్ అనే అంశంపై గ్లోబల్ కాన్ఫరెన్స్‌ను నిర్వహించటం జరుగుతుందన్నారు. ఏబీఏపీ 2025 అవార్డుకు నామినేట్ చేయదలచిన వారు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎబీఏపీ.సీవో.ఇన్ అనే వెబ్‌సైట్ నుంచి అప్లికేషన్‌ని డౌన్లోడ్ చేసుకుని అక్టోబర్ 31వ తేదీలోపు కేఓఎస్ఏజీఐఎస్ఏఆర్ఏఎఫ్1956ఎట్‌దిరైట్‌ఆఫ్‌జీమెయిల్.కామ్‌కు పంపాలని కోరారు. వీటికి సంబంధించిన అబ్‌స్ట్రాక్ట్‌ను నవంబర్ 10 లోగా కాన్ఫరెన్స్‌సీఎల్‌పీటీఎట్‌దిరైట్‌ఆఫ‌జీమెయిల్.కాంకు పంపాలని తెలిపారు. అంతే కాకుండా కాన్ఫరెన్స్‌లో పాల్గొనదలచిన వారు నవంబర్ 24 లోగా రిజిస్ట్రేషన్ ఫీజుని చెల్లించి తమ పేరు నమోదు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏబీఏపీ జనరల్ సెక్రటరీ డాక్టర్ కేఆర్ఎస్ సాంబశివరావు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలుడు తల్లికి అప్పగింత



తప్పిపోయిన బాలుడిని తల్లి నాగలక్ష్మి అప్పగిస్తున్న తహసీల్దారు శ్రీనివాసశర్మ

చేబ్రోలు: ఇంటి నుంచి తప్పిపోయి తిరుగుతూ నారాకోడూరు చేరుకున్న బాలుడిని శనివారం అధికారులు తల్లికి అప్పగించారు. వివరాలు.. పాత గుంటూరు ప్రాంతానికి చెందిన దార్ల కార్తీక్, స్నేహితుడితో కలిసి ఇంటి నుంచి వెళ్లి తప్పిపోయాడు. చేబ్రోలు మండలం నారాకోడూరు ప్రాంతంలో స్కూల్ యూనిఫాంలో ఉన్న బాలుడు శనివారం రోడ్డు వెంట తిరుగుతుండటాన్ని గమనించిన తహసీల్దారు కె.శ్రీనివాసశర్మ బాలుడి ఆరా తీశారు. బాలుడి పేరు మాత్రమే చెప్పిన తల్లిదండ్రుల పేర్లు చెప్పలేకపోయాడు. ఎస్ఐ డి.వెంకటకృష్ణకు బాలుడు కార్తీక్ విషయాన్ని తహసీల్దారు తెలియజేసి తల్లిదండ్రుల వద్దకు చేర్చాలని సూచించారు. పోలీసులు బాలుడి ఫొటోను జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్‌లకు సమాచారం అందించారు. తమ కుమారుడు కనిపించటం లేదంటూ కార్తీక్ తల్లి నాగలక్ష్మి లాలాపేట పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పాత గుంటూరులోని హుస్సేన్ నగర్ ప్రాంతానికి చెందిన దార్ల కార్తీక్, తల్లి బాలుడి ఉన్న విషయం తెలుసుకొని హుటాహుటిన చేబ్రోలు చేరింది. తహసీల్దారు సమక్షంలో పోలీసులు బాలుడిని తల్లి నాగలక్ష్మికి అప్పగించారు.

విజ్ఞాన్‌లో జీటీఎం అండ్ ఫండింగ్ వర్క్‌షాప్



చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో కోటక్ బిజ్‌ల్యాబ్స్ జీటీఎం(గో-టు-మార్కెట్) అండ్ ఫండింగ్ వర్క్‌షాప్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎన్సో వ్యూ ఫౌండర్ అరుణ్ చిన్నస్వామి మాట్లాడుతూ స్కేలబుల్ టెక్ ఉత్పత్తులు రూపొందించాలంటే సరైన ప్లానింగ్, మంచి ఆర్కిటెక్చర్, క్లౌడ్ సొల్యూషన్స్, మరియు డేటాబేస్ ఆప్టిమైజేషన్ కీలకమన్నారు. స్టార్టప్ స్థాయిలో సరైన పద్ధతులు అనుసరిస్తే భవిష్యత్‌లో టెక్నాలజీ ప్రొడక్ట్‌లను సులభంగా స్కేల్ చేయొచ్చనని పేర్కొన్నారు. గ్రోత్ స్ట్రాటజిస్ట్, అప్సెల్ ఫోర్జ్ ఫౌండర్ సందీప్ సిన్హా మాట్లాడుతూ ఒక ఉత్పత్తిని లేదా సేవను విపణిలోకి తీసుకెళ్లే విధానాన్ని గో-టు-మార్కెట్ (జీటీఎం) వ్యూహం అంటారని తెలిపారు. వినియోగదారుల సమస్యలు, అవసరాలు, ప్రాధాన్యలు తెలుసుకోవడం అవసరమన్నారు. అనువైన విక్రయ మార్గాన్ని ఎంచుకోవడం వ్యాపార విజయానికి చాలా కీలకమన్నారు.

భక్తిశ్రద్ధలతో బాజీబాబా దర్గా ఉరుసు మహోత్సవం

వేలాదిగా తరలివచ్చిన భక్తులు



విద్యుత్ కాంతులతో కళకళలాడుతున్న పెదకాకాని బాజీబాబా దర్గా



గ్రామోత్సవానికి బయలుదేరిన బాబావారి గుర్రం, గంధం

పెదకాకాని: బాజీబాబా దర్గా ఉరుసు మహోత్సవం కనుల పండువగా శనివారం ప్రారంభమైంది. పెదకాకాని సయ్యద్ బాజీ షహీద్ అవులియా దర్గా 537వ ఉరుసు మహోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర నలుమూలల నుండి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. తెల్లవారు జామున ప్రత్యేక ప్రార్ధనలతో శనివారం ఉరుసు మహోత్సవం ప్రారంభమైంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో వక్ఫ్‌బోర్డు సూపరింటెండెంట్‌లు ఇబ్రహీంబేగ్, మహ్మద్ హుస్సేన్, దర్గా ఈఓ షేక్ ముక్తార్ బాషా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆయా ప్రాంతాల నుండి తరలివచ్చిన భక్తులు షఫా బావి నీటితో స్నానాలు చేసి దర్గా చుట్టూ ప్రదక్షిణలు చేశారు. సాయంత్రం 7 గంటలకు బాజీబాబా గుర్రం దర్గాలో ప్రదక్షిణలు చేసింది. దర్గా ప్రాంగణమంతా భక్తులతో కళకళలాడింది. పెదకాకాని పొలిమేర సెంటర్ నుంచి ప్రత్యేక చాందినీ అలంకరణలో గంధం బిందెలతో ప్రారంభమైన బాజీబాబా వారి గుర్రం ఆదివారం తెల్లవారుజాము వరకూ వెనిగండ్ల గ్రామ పురవీధులలో తిరిగింది. ఈ మహోత్సవం బాణసంచా వెలుగులు, తీన్‌మార్ తప్పెట్లు, సన్నాయి వాయిద్యాలు, బాండ్‌మేళాలు, విద్యుత్ కాంతుల నడుమ అత్యంత వైభవంగా జరిగింది. దర్గాకు చేరుకున్న భక్తులు బాబా వారి గుర్రం వెంట నడిచారు. పురవీధులలో భక్తులు బాబావారి గుర్రం మిఠాయిలు, కొబ్బరికాయలు, పూలమాలలు, పూజా సామగ్రి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వేలాదిగా తరలివచ్చిన భక్తులకు వేసవికాలాన్ని దృష్టిలో పెట్టుకుని ఉచితంగా అన్నదానం, తాగునీరు, టెంట్లు ఏర్పాటు చేశారు. వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీ అధికారులు సహాయ సహకారాలు అందించారు. ఊరేగింపు ముగించుకుని బాబావారి గుర్రం ఆదివారం సాయంత్రం 3 గంటలకు దర్గాకు చేరుకుంటుందని అనంతరం భక్తులకు గంధం పంచిపెట్టడం, సలామి ప్రార్థనలతో ఉరుసు మహోత్సవం ముగుస్తుందని ఈఓ షేక్ ముక్తార్ బాషా తెలిపారు.